
# వైద్యుడు · యజ్ఞీ శర్మ




సంజీవి ఫోన్ చేశాడు నన్ను వెంటనే బయలు దేరి రమ్మని. మా బాబాయి శేఖరానికి సడెన్‌గా ఏదో సుస్తీ చేసిందనీ, నా సలహా చాలా అవసరమనీ. టైము చూస్తే ఒంటి గంటయింది. డ్రస్ చేసుకుని, బాగ్‌లో బట్టలు సర్దుకుని స్టేషన్‌కి బయలు దేరాను. పినాకిని ప్లాట్‌ఫారమ్ మీద ఉంది. ఎక్కి కూర్చున్నాను.




శేఖరం విజయవాడలో అడ్వకేట్‌గా ఉన్నాడు. వరసకి బాబాయైనా, ఒరేయ్ అంటే ఒరేయ్ అనుకునే స్నేహం మాది. ప్లీడరు ప్రాక్టీసులో ఆదాయం అంతంత మాత్రమే అయినా ఏదో నెట్టుకొస్తున్నాడు. వాళ్లమ్మ పేర కొంచెం పొలముంటే ఈ మధ్యనే అమ్మి చిన్న ఇల్లు కట్టాడు. గృహప్రవేశానికి నన్ను తప్పకుండా రమ్మని రాశాడు. నాకు వెళ్లడం పడలేదు. నా నర్సింగ్‌హోమ్ ఒక్కరోజు కూడా వదిలి వెళ్లడం కష్టంగా ఉంది. ఆరునెలలన్నా కాలేదు. ఎలాంటి సుస్తీయో తెలీదు, ఆ ఇల్లు అచ్చి రాలేదేమో.

నేను రైలు దిగి రిక్షా చేసుకుని సరాసరి సూర్యారావు పేటలో సంజీవి ఇంటికి వెళ్లాను. సంజీవి నా క్లాస్‌మేట్. రాత్రి పదిగంటలైంది. అతనేదో చదువుకుంటూ మేలుకునే ఉన్నాడు.

'నువ్వొస్తావని నీ కోసమే వెయిట్ చేస్తున్నా, పినాకినిలోనా?'

'ఔను, శేఖరానికెలా ఉంది? ఏమిటి సుస్తీ? ఎన్నాళ్ల నుంచీ?'

"నువ్వేమీ కంగారు పడకు. నిన్న సాయంత్రం చెస్ట్ పెయిన్" అని నాదగ్గర కొచ్చాడు. మరేంలేదు. రెస్టు తీసుకోమని చెప్పి మందిచ్చి పంపాను. ఈ రోజు ఉదయం వాళ్లబ్బాయి రామూ వచ్చి వాళ్లింటికి తీసికెళ్లాడు. పరీక్ష చేసి మైల్డ్ హార్టెటాక్ అనిగ్రహించాను.

"అలా అని వాళ్లకి చెప్పావా?"

"నీలా ఎమ్.డి. అవీ చదివి పెద్దప్రాక్టీసు లేకపోయినా, నేనూ డాక్టర్నే, నాకూ తెలుసు ఈ ప్రొఫెషన్ ఎథిక్స్."

"అమ్మయ్య రక్షించావ్. ఇప్పుడు చెప్పు ఈజిట్ వెరీ సీరియస్?"

"కొన్ని పరీక్షలు చేస్తే గాని తెలీదు. నువ్వు మెడ్రాస్ తీసికెళ్లి డయాగ్నైజ్ చేస్తే మంచిది."

'రేపు కలుస్తాన'ని చెప్పి శేఖరం ఇంటికి బయల్దేరాను.

అర్ధరాత్రి నేను రావడం చూసి మరింత కంగారు పడతారేమోనని, ఆ రాత్రికి సంజీవి ఇంట్లో ఉండి, ఉదయం శేఖరం ఇంటికి వెళ్లొచ్చు అనే ఆలోచన వచ్చింది. కానీ సంజీవి ఉండమనలేదు. ఆ రాత్రి నేను శేఖరం దగ్గర ఉండటమే మంచిదనుకొని ఉండచ్చు సంజీవి.

శేఖరం ఇంటికెళ్లి తలుపు తట్టాను. శేఖరం భార్య సవిత తలుపు తీసింది. నన్ను చూసి ఆశ్చర్యపోతూ 'సంజీవి గారు నీకు ఫోన్ చేశారా?' అంది.

"లేదే, ఏమిటి సంగతి? శేఖర్ ..."

"ఆయన పడుకున్నారు. అందరూ పడుకున్నారు. నువ్వు వెనకవైపు నుంచి వంట గదిలోకి రా" అని వంట గది తలుపు తీసింది. భోజనం చేసే దాకా వదల్లేదు. చేస్తూంటే చెప్పింది జరిగిన సంగతి.

ఉదయం లేచేసరికి ఎనిమిది గంటలైంది. శేఖరం మంచం మీద పడుకుని పేపరు చదువుతున్నాడు. 'గుడ్ మార్నింగ'ంటూ నేనే అతని దగ్గరగా కూర్చీ లాక్కుని కూర్చున్నాను.

'ఏమిటిలా ఊడిపడ్డావ్, అంతా కుశలమా?' అన్నాడు శేఖరం.

'సంగతి చెప్పు, నిన్న ఏదో హడావుడి చేశావట?'

"ఏమీ లేదు. సంజీవి వచ్చి చూశాడులే"అని, ఇంకెవ్వరూ అక్కడ లేరని నిర్ధారణ చేసుకుని, నా చెవిలో 'ఎవరికీ చెప్పకు, చిన్న హార్ట్ ఎటాక్' అన్నాడు.

ఎన్నో కేసులు రోజూ చూస్తున్న నాకే వాడలా చెప్పడం చూసి గుండె వేగంగా కొట్టుకోవడం మొదలు పెట్టింది. సంజీవి చెప్పక పోయినా వీడికి తన పరిస్థితి తెలుసు. తెలిస్తే భార్యా, పిల్లలు, తల్లి కంగారు పడ్తారని బయటికి చెప్పడం లేదు.

సవిత కాఫీ తెచ్చి ఇస్తూ, 'రాహుల్! సమయాని కొచ్చావ్, నువ్వు బాగా పరీక్ష చేసి చెప్పు, నాకు చూస్తే ఈయన పరిస్థితి ఏమీ బాగోలేదనిపిస్తుంది'

సవితకి కూడా చూచాయగా తెలిసే నన్నడిగి నిర్ధారణ చేసుకోవాలనుకుంటూంది. నేను పరీక్ష చేసి 'నిద్ర పడ్తోందా?' అనడిగాను.

"రాత్రి బాగానే నిద్రపోయారు, నిద్ర మాత్రేమైనా ఇచ్చారేమో డాక్టర్‌గారు"

"కంగారు పడేందుకేమీ లేదు. పూర్తిగా రెస్ట్ తీసుకుని పదిరోజులు కోర్టువైపు వెళ్లకు. సవితా, నీవెవరిన్నీ ఇంటికి రానీకు. మద్రాసు వెళ్లారని చెప్పి పంపంచేయ్ - అదీ నిజమే, నేను వీణ్ణి నాతో మద్రాసు తీసికెళ్తున్నాను."

సవిత ముఖం వివర్ణమైంది.

"భలే డాక్టరువయ్యా, ఏమీ లేదంటూనే మద్రా సు ప్రయాణం కట్టిస్తున్నావ్. నేనూ వస్తాను."

ఇంక ఆ విషయం పొడిగించటం ఇష్టం లేక 'నాకు వూళ్లో కొంచెం పనుంది. వీలైతే సంజీవిని కూడా కలుస్తాన్లే' అని చెప్పి స్నానం చేసి బట్టలు మార్చుకుని వీధిలో కొచ్చాను.

మద్రాసు తీసికెళ్తే టెస్టులకీ, ఆపరేషను చెయ్యాల్సొస్తే దానికీ ఒక లక్షయినా కావాలి. తను కొంత సహాయం చెయ్యగలడు. మిగతా ఖర్చులు భరించేందుకైనా శేఖరానికి స్తోమత లేదు. ఆపరేషన్ సక్సెస్ అవుతుందని గ్యారంటీ ఏమిటి?

సీరియస్ కాకపోతే సంజీవి ఫోన్ చెయ్యడు. ఆపరేషన్ చెయ్యాలని తెలిశాక మానేస్తే అది బతికున్నంతకాలం పీకుతూ ఉంటుంది. ఆపరేషన్ చేయించుకుని చక్కగా తిరుగుతున్న వారు కనిపిస్తారప్పుడు. ఆపరేషన్ విఫలమైతే ఆ కుటుంబానికి సంపాయిస్తున్న ఒక్క మనిషినీ లేకుండా చేసి పైగా ఆ ఉన్న ఇంటిని ముంచే అప్పుల పాల్చెయ్యడం. రిస్కు తీసుకోవడమా, మానడమా? సంజీవిని కలిస్తే మటుకేం చెప్తాడు? అతను చెప్పాల్సింది రాత్రే చెప్పాడు. ఇక్కడ టెస్టు చేసేందుకు సరైన పరికరాలుండవ్. మద్రాసులో ఐతే అన్నింటికీ వీలు.

నాకూ, శేఖర్‌కీ వడ్డిస్తూ సవిత అది - 'నువ్వు ఖర్చుకేమీ వెనకాడద్దు. ఈ ఇల్లు అమ్మైనా ఆయన్ని రక్షించుకుంటాం, అసలీ ఇల్లు కట్టిం దగ్గిర్నించీ అన్నీ అవస్థలే. చివరికి కొంత లోన్ తీసుకుని పూర్తి చెయ్యాల్సొచ్చింది. ఆర్నెల్లు తిరగ లేదు. ఈయనకిట్లా వచ్చింది. ఈ ఇల్లు మాకచ్చిరాలేదు.'

శేఖర్ అన్నాడు 'నాకేమీ భయం లేదు. ఇంత కష్టపడి, అద్దెలు పొయ్యలేక, ఉండడానికి కట్టుకున్న ఇల్లు కన్నతల్లి లాంటిది. ఇది తరతరాలుగా ఇలా ఉండిపోవాల్సిందే.'

'మనుషుల కంటే ఎక్కువా?' అడిగింది సవిత.

'ఎక్కువే మరి, మా తండ్రి తాతలకి లేదు, నేను కట్టగలిగాను. మళ్లీ నా పిల్లలు కట్టగలరో, లేదో, నేనేం పెద్ద చదువులు చదివించగలను, వాళ్లే పెద్ద ఉద్యోగాలు చెయ్యగలరూ'

నేనన్నాను. 'ముందే మీరనవసరంగా తర్జన భర్జనలు పడుతున్నారు. ఇల్లమ్మనక్కర లేకుండా నీకు నయమవుతుంది. అదే గదా మీక్కావలసింది'

హాల్లో మడత మంచం మీద పడుకున్నానన్న మాటే కానీ మైండ్ ఆలోచిస్తూనే ఉంది. ఇల్లు కట్టకుండా ఆ డబ్బు బ్యాంకిలో వేసుకుని ఉంటే పిల్లల చదువులకీ, పెళ్లిళ్లకీ పనికొచ్చేది. మనిషెపుడూ తన ఆదాయం, ఖర్చూ లెక్క చూసుకుని తన స్తోమతెంతో అంచనా వేసుకుని ఏ పనైనా మొదలు పెట్టాలి. నిజమే, తనకి

రోగమొస్తుందని శేఖరానికి తెలీదు. వచ్చినా లక్షలు మింగే రోగమవుతుందని అంతకంటే తెలీదు.

'నాయనా, మంచీనీళ్లు కావాలా?' అంటూ శేఖరం తల్లి నా దగ్గరి కొచ్చింది. నేను లేచి కూర్చుని 'మీ ఆరోగ్యం ఎలా ఉంది బామ్మగారూ?' అన్నాను.

'నాకేం బాగానే ఉన్నాను. నిన్న ఆ డాక్టరొచ్చాడు, ఇవ్వాళ నువ్వొచ్చావు. శేఖరం మంచంలోంచి దిగడం లేదు., ఏదైనా కొంప ముంచే జబ్బు కాదు గదా?'

'నేనేదో పని మీద ఇక్కడి కొచ్చాను. వచ్చాన గదా అని మీ ఇంటి కొచ్చాను. శేఖరానికేం, మామూలు గానే ఉన్నాడు.'

'కోడలు గుడ్ల నీళ్లుగుక్కుకుంటుంటే చూశాను. నా దగ్గర కూడా దాయకు. వాడి కొచ్చింది గుండె జబ్బుట. ఎంతో కాలం బతకడుట.'

నాకింకా అనుమానంగా ఉంది గాని వీళ్లందరికీ నిర్ధరణైపోయింది. హార్ట్ ఎటాక్ ఒకసారి వచ్చాక జాగ్రత్తగా ఉండాల్సిన మాట నిజమే గాని, వీళ్లకెవరు చెప్పారు, ఎంతో కాలం బతకడని? ముసలావిడతో అన్నాను.

'ఛ, ఛ, అలాంటి మాటలనకూడదు. మీరసలన కూడదు. డాక్టరుగా చెప్తున్నాను, శేఖరానికొచ్చిన భయమేమీ లేదు.'

'ఎందుకైనా మంచిది, మావాడికి నేను చెప్పానని చెప్తావ్గా?' ఆవిడ హాలులో ఇంకెవరూ లేరని రూఢి చేసుకుని అంది.

'చెప్పండి, మీ మనసులో మాట'

'నా పొలం అమ్మి ఈ ఇంటి మీద పెట్టాడు. రేపనుకోగూడనిది జరిగితే నా గతేమిటి? ఇంట్లో సహం వాటా నా పేర రాస్తే నన్ను కోడలూ, పిల్లలూ సరిగా చూస్తారు. నా తదనంతరం వాళ్లకే గదా.'

నాకు షాక్ కొచ్చినట్లైంది. "వాడికేదైనా అయిందంటే నేను తట్టుకోలేను. అలాంటిది జరిగే ముందు నాకింత విషమిచ్చి నన్ను చంపెయ్, బాబూ' అంటుందనుకున్నాను. ఇదేమిటి? తల్లి అడగాల్సిన మాటేనా ఇది? ముందు ఈవిడ గొంతులో ఒక మాత్ర వేసి చంపెయాలన్నంత కోపం వచ్చింది. ఆవిడ ముఖం చూశాను. జుట్టంతా ఊడి పోయి నాలుగు పరకలు తెల్ల వెంట్రుక లున్నయ్ నెత్తిమీద. ముఖం ముడతలు పడిపోయింది. కళ్లు గుంటలు పడిపోయినై. తనెన్నాళ్లు బతుకుతుంది? ఐనా తనకో సెక్యూరిటీ కావాలి. కొడుకు ముందు తను దాటి పోవాల నుకోడం బదులు, కొడుకు పోయాక తన బతకు గురించి ఆలోచిస్తోంది. ఏం మనిషి? ఆవిడతో ఈ మాటలనాలనిపించలేదు. మాట్లాడ్డానికి కూడా అసహ్యం వేసింది. ఐనా అన్నాను.

'మన చేతిలో ఏముంది చెప్పండి. దేవుడెవరి కెంత ఆయుర్దాయం రాశాడో అంతకాలం బతకాల్సిందే. చిన్నవాళ్ల ముందు పెద్ద వాళ్లు పోవడం, సహజం. అలాకాక పోతే పెద్దవాళ్లు ఏ జన్మలోనో చేసుకున్న పాపానికి శిక్ష.'

ఇంతలో సవిత అక్కడికి రావడంతో ముసలావిడ లేచి వెళ్లి పోయింది.

'ఆయనిక్కడుంటే అశ్రద్ధ చేస్తారు. ఎంత ఖర్చైనా ఫర్వాలేదు. మద్రాసు వస్తాం' అని సవిత

'నీకు తెలీదు రాహుల్, నాకిక్కడుంటేనే తృప్తి. మంచి మందులు రాసిచ్చి వెళ్లు. ఆ మద్రాసు మహా నగరంలో మన భాష కాదు, మన వాళ్లు కాదు. ఇక్కడైతే కృష్ణాతీరం. మనవాళ్లూ, ఫ్రెండ్సూ అందరూ ఆదుకొనే వాళ్లు ఇక్కడున్నారు' అని శేఖరమూ మొరాయిస్తే ఎటూ చెప్పలేక, ఏవో మందులు రాసి, కొనిచ్చి వాడమని చెప్పి వచ్చేశాను.

మద్రాసు వచ్చానన్న మాటే గాని మనసులో పీకుతూనే ఉంది పొరపాటు చేశానేమోనని. తరువాత నాలుగు రోజులకి సంజీవి ఫోన్ చేశాడు. శేఖరం, సవిత మద్రాసు వస్తున్నారని, స్టేషనుకొచ్చి రిసీవ్ చేసుకోమని. స్టేషనుకెళ్లి వాళ్లిద్దర్నీ ఇంటికి తీసుకొచ్చాను.

శేఖరం చెప్పాడు 'ఇంట్లో సగం వాటా అమ్మపేర రాస్తానని ఆవిడకి మాటిచ్చాను. ఆవిడ అలా రాయమని నన్నడగలేదు. నేను బాగా ఆలోచించి ఆ నిర్ణయాని కొచ్చాను. ఆవిడ పొలం అమ్మి ఇంటి మీద పెట్టినప్పుడామె నన్నొక్క పైసా అడగలేదు. తన భారం నా మీద ఉంచింది. నేనావిణ్ణి మోసం చెయ్యలేను.

సవితనడిగాను 'మరి నువ్వైనా నీ సంగతి, పిల్లల సంగతీ, ఈ జబ్బు సంగతీ ఆలోచించలేదా?'

సవిత సమాధానానికి ఆశ్చర్యపోయాను.

'రాహుల్, ఆయన న్యాయవాది. ఆయన నిర్ణయం నాకూ న్యాయంగాతోచింది.

రేప్పొద్దున పిల్లల కోసం గత్యంతరం లేక నేనావిడికన్యాయం చెయ్యొచ్చు. కన్నకొడుకలా చేయ్యలేడు. నేను 'ముసలావిడ కోరిక మీకెలా తెలిసింది. ఆవిడ మిమ్మల్నడగలేదంటున్నారు?' సవిత చెప్పింది, నాతో ముసలావిడ చెప్పిందంతా సవిత విందట. ఆమాట భర్తకి చెప్పిందిట.

టెస్టు పూర్తయ్యాక వెంటనే ఆపరేషన్ చెయ్యాలనీ, చెయ్యకపోతే చాలా ప్రమాదమనీ వాళ్లకి చెప్పి ఆపరేషన్ రోజుకి సంజీవిని కూడా పిలిపించాను.

సంజీవి శేఖర్‌తో అన్నాడు. 'మీ ఇల్లు నన్ను కొనమని రాహుల్ బలవంతం చేస్తున్నాడు. నీకిష్టమైతే చెప్పు. ఆపరేషన్ కయ్యే ఖర్చు ఎడ్వాన్సుగా ఇస్తాను. రాహుల్ ఫోన్‌లో చెప్తే డ్రాఫ్టు తీసుకొచ్చాను.

శేఖర్ నావంకా, సవిత వంకా చూశాడు. 'రాహుల్ అన్ని ఏర్పాట్లూ నువ్వే చేశావ్. థ్యాంక్స్. నాకేమైనా ఐతే మరి మా అమ్మ మాట?' నీ జబ్బు మాటలా ఉంచి ముందు మీ అమ్మకీ, నీకూ పట్టిన పిచ్చి కుదర్చాలని లోపలే అనుకుని, శేఖర్‌తో-

'నీకేమీ భయం లేదు. ఆపరేషన్ సక్సెస్ అవుతుంది.' అని చెప్పి, మిగిలిన వాళ్లందర్నీ బయటకి వెళ్లమని, శేఖర్‌తో ఇలా అన్నాను. 'ఇది నీమనసులోనే ఉంచు. జరగకూడనిది జరిగితే ఆ సంగతి మీ అమ్మకి. తెలియనీయం. జబ్బు నయం చేసుకోడానికి అమెరికా వెళ్లావని చెప్తాం. అందుకు ఇల్లు అమ్మక తప్పలేదని, కొన్నాళ్లు అద్దె చెల్లిస్తూ ఆ ఇంట్లోనే ఉండే ఏర్పాటు చేశామనీ చెప్తాం.'

శేఖర్ తల్లీ పిల్లలూ కూడా మద్రాసు వచ్చారు ఆపరేషన్ రోజుకి. శేఖర్ తల్లికి చెప్పాను, ఆపరేషన్ సక్సెస్ ఐనట్లూ, ఇక శేఖరానికేం భయంలేదనీ.

'శేఖరాన్ని కాపాడాం. మరి ఇల్లు అమ్మక తప్పలేదు బామ్మగారూ' అన్నాను.

ఆవిడంది 'పోనీలే నాయనా, నాకొడుక్కంటే ఇల్లేం ఎక్కువ కాదు. అదివరకున్నట్టే అద్దె ఇంట్లోనే ఉంటాం. నేను చెప్పి చేయించాల్సిన పని నువ్వే చేయించావ్." సవితలో కూడా ఎంతో తృప్తి కనిపించింది. సంజీవి ముందే వెళ్లిపోయాడు. పదిరోజుల తరువాత సవిత, శేఖర్, పిల్లలూ, బామ్మగారూ విజయవాడ బయలుదేరారు. వాళ్లతో స్టేషనుకెళ్లి ప్లాట్‌ఫారం మీద పళ్లు కొని సవితకిస్తూ అసలు సంగతి చెప్పాను. టెస్టువల్ల ఆపరేషన్ అవసరం లేదని తేలింది. సంజీవి డబ్బు ఇవ్వనూ లేదు. ఇల్లు కొననూ లేదు. శేఖర్‌కు మత్తు మందిచ్చి మా నర్సింగ్ హోమ్‌లో ఒక రోజుంచి 'కట్లు' కట్టి మా ఇంటికి తీసుకొచ్చాను. అంతే. మీరు మీ ఇంట్లో హాయిగా ఉండండి.'

రైలు కదుల్తోంటే కిటికీలోంచి సవిత అంది 'రాహుల్, వైద్యుడివంటే నువ్వు.'

